
# మనసున మనసై

- రాపాక సన్ని విజయక్రిష్ణ



**బైక్ సౌండ్ వింటూనే ఒక్క ఉదుటున వరండాలోకి వచ్చింది అలకనంద. కాంపౌండ్‌లోకి దూసుకొచ్చి, బైక్ మీదనుంచే భార్యను విష్ చేసాడు సిద్ధార్థ.**

తన రాకకోసమే ఎదురుచూస్తున్నట్టు- తుమ్మెదకోసం విరిసిన పుష్పాల్లా ఉన్నాయి ఆమె కన్నులు. పెదాలు చిరునవ్వుల ఇంద్రచాపాలై ఆహ్వానించాయతన్ని. హృదయంలో పొంగిన ఆనందాన్ని దాచుకునే ప్రయత్నం చేయలేదతను. బైక్ స్టాండ్ వేసి భార్య దగ్గరకొచ్చాడు. ఆమె కళ్ళల్లోంచి తన చూపులతో తేనెలు గ్రోలుతున్నట్టు మత్తుగా "థాంక్యూ"అన్నాడు. భర్త చేతిలో బ్యాగ్ అందుకుంటూ "ఎందుకూ!" అంది ఆశ్చర్యబోయినట్టు. హాల్లోకి వచ్చారిద్దరు. భార్యను పొదవి పట్టుకుని "ఎలా ఉండాలనుకున్నానో నువ్వలా ఉన్నందుకు" అన్నాడు. మృదువుగా తన పెదాలతో ఆమె చెంపల్ని రాసాడు.

'అయితే నేనే మీకు కృతజ్ఞతలు చెప్పాలి' అందామె, భర్త పెదాల స్పర్శకు పులకిస్తూ. 'అదేమిటీ!' ఆశ్చర్యపోయాడతను. ఆమె అందంగా నవ్వింది. నవ్వి, 'నేనెలా ఉన్నానో మీకలా నచ్చినందుకు' అంది. "మరి నేను?' ఆసక్తిగా అడిగాడు. దానికి సమాధానంగా మునికాళ్ళమీద లేచి భర్త పెదాలందుకుని ముద్దాడి గదిలోకి పరుగు తీసింది. అతను భార్య వెనకాలే పరుగుదీసి ఆమెను పట్టుకుని గట్టిగా కౌగిట్లో బంధించాడు. తప్పించుకునే ప్రయత్నం చేయలేదామె. 'మీకు కొంచెం చొరవిస్తే చాలు ఎప్పుడుబడితే అప్పుడు రెడీ అయిపోతారు' అంది భర్త కౌగిలిని హాయిగా అనుభవిస్తూ.

అంతకంటే హాయినేదో అతను అందుకుంటూంటే...

***

"ఏమిటి సిద్ధార్థ- ఇంటికి వెళ్ళరా ఏమిటి!" అతని ఊహలు చెదరగొడుతూ అతని కొలీగ్ నందన్.

అప్పటికి అందరూ వెళ్ళిపోయినట్టు ఆఫీసు నిశ్శబ్దమైపోయింది. అతని మనసూ అలాగే స్తబ్దమైపోయింది. భారంగా నిట్టూర్చి నందన్ వెనకాలే బయటకు నడిచాడు సిద్ధార్థ.

***

కాఫీ కలుపుకొచ్చి సోఫాలో అలసినట్టు కూర్చున్న భార్యకు ఒక కప్ అందించి తనూ ఆమె ప్రక్కనే కూర్చున్నాడతను.

"థాంక్యూ" అంది అలకనంద. "మీరిలాచేస్తే నచ్చుతుంది కానీ బాధేస్తుంది. ఒక నిమిషం ఆగితే నేనే యిస్తానుగా!" అంది నొచ్చుకుంటున్నట్టుగా 'ఇప్పుడేమైందనీ- నువ్వూ అలసిపోయి వస్తావు. నువ్వు ముందొస్తే నువ్వే చేస్తావుగా!" అన్నాడు సిద్ధార్థ.

సోఫాలోంచి లేచి మోకాళ్ళమీద కూర్చుని భర్త వళ్ళో తలపెట్టుకుని 'థాంక్యూ' అంది. నాలాగే నువ్వూ జాబ్ చేస్తూ అలసిపోతావనే కాదు. మామూలుగానైనా నేనిలా ఇంటి పనులు షేర్ చేసుకోవటంలో గొప్పతనమేమీ లేదు'అన్నాడు. భార్య తలమీద ముద్దాడాడు.

భర్త పట్ల కృతజ్ఞతతో వూరిన కన్నీళ్ళు ఆనంద భాష్పాలుగా చెక్కిలి మీదకు జారాయి.

*

అంత అందమైన కలను చెదరగొడుతూ కాలింగ్ బెల్ మోగింది. ఉలికిపడి లేచింది అలకనంద. సోఫాకు జారబడి క్రింద కూర్చునుందామె. తడిచిన కళ్ళు తుడుచుకుని వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా భర్త సిద్ధార్థ. ఏదో వెతుక్కుంటున్నట్టు భర్త మొహంలోకి చూసింది. అతనూ భార్య కళ్ళలోకి చూసాడు. ఏ భావమూ ఇద్దరికీ చేరలేదు.

ఆమె మౌనంగా కిచెన్‌లోకి నడిచింది. అతను బ్యాగ్ టీపాయ్ మీదకు విసిరి, టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. స్నానం ముగించి వచ్చేసరికి కాఫీ కప్‌తో సిద్ధంగా వుందామె. భార్య చేతిలో కాఫీ కప్ అందుకుని సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

"నీకేదీ!"

"నాకు తాగాలని లేదు" చెప్పిందామె ముభావంగా.

అతనేం బ్రతిమలాడలేదు. అస్సలదేం పట్టించుకోనట్టే కాఫీ తాగాడు. ఖాళీచేసిన కప్ తీసుకుని కిచెన్‌లోకి వెళ్ళి పనుల్లో పడిపోయిందామె.

అతను టి.వి. ఆన్ చేసి రిమోట్ అందుకున్నాడు, రిపీటెడ్‌గా చానల్స్ మారుస్తున్నాడు గానీ అతని మనసేమీ టి.వి. మీద లేదు.

భార్యతో ఈ పరిస్థితి చాలా విసుగ్గా వుందతనికి. తామిద్దరూ మాట్లాడుకోకుండా ఏమీలేరు. మాటల్లో నిశ్శబ్దముంటుందని- గ్యాప్ ఉంటుందని ఇన్నాళ్ళూ తెలీదు. ఈ అనుభవం ఎంతో అశాంతిగా వుంది. భార్య మీద కోపంగా వుంది.

"...ఎంత సంతోషకరమైన రోజులు ఎంత త్వరగా వెళ్ళిపోయాయో... ఒక్కరోజు గడవటమే దుర్భరంగా అనిపిస్తోంది. సుమారు నెల రోజులనుంచి ఈ యాతన. ఎందుకంత పట్టుదల తనకు. ఏం లోటుందని... ఏమి లోటుచేస్తున్నాననీ... భార్యంటే ఎలా ఉంటే తనకిష్టమో అంతలా చెప్పాక కూడా తనలా తన ఇష్టాన్నే నెగ్గించుకోవాలని చూస్తుందంటే ఎలా భరించటం..." అసహనంగా రిమోట్ పక్కన పడేసాడు.

'తను మారొచ్చుగా! నన్ను అర్థంచేసుకోవచ్చుగా! ఎన్నాళ్ళిలా...' అని ఆలోచించాడు. మనసంతా చిరాకుగా మారిపోయింది.

"ఏం కూర వండమంటారు!" వంట గదిలోంచి భర్త దగ్గరకు వచ్చి అడిగింది.

చిరాకు బయటపడకుండా "నీ యిష్టం" అన్నాడు.

భర్త వైపు చూస్తూ కాసేపు అలాగే నిలబడిపోయిందామె. తరువాత కిచెన్‌లోకి వచ్చి భర్తకి ఇష్టమైన విజిటబుల్స్ ఫ్రిజ్‌లోంచి తీసింది.

'...ఎంత వివరంగా చెప్పింది తను. ఎంత ప్రాధేయపడిందీ- ఏ పరిస్థితులు తననలా ఆలోచించేలా- నిర్ణయం తీసుకునేలా చేసాయో ఎంత అనునయంగా చెప్పిందీ... ఆయన కాకపోతే ఎవరు గ్రహిస్తారు తన మనసునీ...' ఉక్రోషంగా అనుకుంది.

'ఈ యాంత్రికమైన రోజులు పోయి, పెళ్ళైన మొదటి రోజులు... నెల క్రితంవరకూ గడిచిన ఆ అద్భుతమైన రోజులు త్వరగా వచ్చేస్తే బాగుణ్ణు... ఆయన మనసు మారితే బాగుణ్ణు...' ఆశగా అనుకుంది అలకనంద.

అంతలోనే "అనవసరంగా నేనే ఈ పరిస్థితి తెచ్చుకున్నానా! తను ఎక్కువగా భయపడుతోందా! తన భయాలన్నీ అర్థం లేనివా! ఆయన చెప్పినట్టే వింటే నెలరోజలుగా అనుభవిస్తున్న ఈ బాధ ఇద్దరికీ తప్పి వుండేది కదా!..."అని ఆలోచించింది. '...కానీ ఎన్నో భయాల్నుంచి, అభద్రతనుంచి బయటపడాలంటే ఈ కష్టం - ఈ వేదన కొన్నిరోజులు తప్పదు భరించాలి. తన భయం అర్థం లేనిదేం కాదు. తను అనుభవించింది' అని ధైర్యపడింది.

మళ్ళీ వెంటనే "ఈ కోల్డ్‌వార్ వల్ల ఫలితముంటుంది- లేక ఇంకా తమ మధ్య గ్యాప్ పెరుగుతుంది!" అనుమానపడింది.

వంట చేసేలోగా ఏదో పనుందంటూ బయటకెళ్ళిన

సిద్ధార్థ వచ్చేటప్పటికి చాలా ఆలస్యమైంది. డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్ది భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చుంది అలకనంద.

తను రావటం ఆలస్యమౌతుందని తనకోసం చూడకుండా భోజనంచేసి నిద్రపొమ్మని ఫోన్ చేసినా అంత రాత్రివరకూ తన రాకకోసమలా ఎదురుచూస్తున్న భార్యను చూసేసరికి అతని మనసంతా ఆమెమీద అనురాగంతో నిండిపోయింది. తనమీద అలిగి కూడా తన పట్ల భార్య చూపిస్తున్న శ్రద్ధ చూసి అతని హృదయం భార్య పట్ల కృతజ్ఞతతో కరిగిపోయింది.

కొసరి కొసరి భార్యతో భోజనం తినిపించాడు. ఆమె ఏమీ బెట్టు చేయలేదు. చాలా రోజుల తర్వాత ఇద్దరికీ ఆ రాత్రి భోజనం సంతృప్తినిచ్చింది. అయినా- ఇంకా ఏదో గ్యాప్ మిగిలిపోయిన భావనతో పడగ్గది చేరారిద్దరూ.

పది నిమిషాలు గడిచి ఉంటాయి... వాళ్ళిద్దరూ మంచమ్మీదకు చేరి. ఆ పది నిమిషాలూ పది గంటల్లా భారంగా అనిపించాయతనికి. అటు తిరిగి పడుకున్న అతను భార్యవైపు తిరిగాడు. ఆమె వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకుని ఉంది.

కొద్ది రోజులుగా కనిపించని ప్రశాంతత ఏదో భార్య ముఖంలో కనిపించింది. ఆమె నిద్రపోవటం లేదని అతనికి తెలుసు.

రెండు చేతులూ పొట్టమీద వేసుకుని... కాలుమీద కాలు వేసుకుని- వైట్ మెరూన్ కలర్ మీద చిన్ని చిన్ని పూలతో ఉన్న నైటీలో ధ్యానం చేస్తున్నట్టుగా ముగ్ధలా హృద్యంగా ఉంది.

'ఎంత అపురూపంగా ఉందో...' గర్వంగా అనుకున్నాడు.

'మూసి వున్నా, ఆ అందమైన కన్నుల్లో తనని వశీకరించుకునే మంత్రమేదో ఉంది. ముద్దులకై పూసి అరవిరిసినట్టున్న ఆ పెదాలు తనని ఆహ్వానిస్తున్నట్టే ఉన్నాయి' అనుకున్నాడు గానీ బిడియమేదో అతన్ని ఆపింది.

చెంపల మీద సన్నగా మెరిసే నూగారు... కదిలే కురులు... ఆ సన్నటి వెలుగులో అతని మనసుని గిలిగింతలు పెట్టాయి.

అతని కదలిక ఆమెకి తెలిసి, తననే చూస్తున్నాడని గ్రహించిందో ఏమో పెదాలతోబాటు ఆ చిన్ని గడ్డం కూడా చిన్నగా అదురుతుంటే అతని గుండె శృంగారపు మధువులో ముంచినట్టయి ఇక ఆగలేనట్టు ఆమె పెదాలను గాఢంగా అద్దుకున్నాడు. పొట్టమీద ఉన్న ఆమె చేతులు చటుక్కున కదిలి అతడింకా మొహమాటపడతాడేమో అన్నట్టు అతని చెవుల చుట్టూపోయి తలను గట్టిగా పట్టుకున్నాయి.

రకరకాలుగా ఆ ముద్దునే ఎంతసేపు అనుభవించారో తెలియదు గానీ చాలాసేపటి తర్వాత చిన్న చప్పుడుతో విడివడ్డ పెదాల్లోంచి ఆమె అడిగింది భర్తని "ఎందుకంత బిడియం!"

తననే చూస్తూ ఏదో వెతుకుతున్న మర్మం తెలియని ఆ కన్నులు ఆ మసక మసక వెల్తురులో కూడా స్వచ్ఛంగా మెరుస్తుంటే ఆ కళ్ళల్లోకి తన్మయంగా చూస్తుండిపోయాడు గానీ ఏమీ మాట్లాడలేకపోయాడు.

భర్త జుత్తులోకి రెండుచేతులూ పోనిచ్చి "నేను... మీ సొంతమేగా" అంది మార్దవంగా. అతను కరిగిపోయినట్టు భార్యను గట్టిగా కౌగిలించుకున్నాడు. "నీ అభిప్రాయాన్ని మన్నించకుండా కఠినంగా ప్రవర్తిస్తున్నానుగా" అన్నాడు, చిన్నగా పశ్చాత్తాపమేదో మొదలైనట్టు.

ఆమె అదేమీ గమనించలేదు. భర్త వీపు చుట్టూ చేతులువేసి తనకేసి మరింతగా హత్తుకుంటూ "నేనుకూడా మీ అభిప్రాయాన్ని గౌరవించకుండా బాధపెట్టాను కదూ!" అంది. "ఇక బాధపెట్టను" చెప్పింది.

అతను సంభ్రమంగా "నిజంగా!" అన్నాడు. "ఎందుకు?!" ఆశ్చర్యంగా అడిగాడు. "ఎందుకంటే... మీతో ఈ దూరం భరించలేనిక. నా భయాలన్నీ అర్థం లేనివేమో అనిపించాయి. మీకు అనుకూలంగా నడుచుకోవటమే సంతోషంగా ఉంది" అంది. "ముఖ్యంగా మిమ్మల్నిక బాధపెట్టకూడదని..." చెప్పింది.

"...థాంక్యూ... థాంక్యూ" అంటూ అదోలా గొణికాడు.



సిద్ధార్థకు అలకనంద గుర్తుకొచ్చింది. మనసంతా దిగులుతో నిండిపోయింది. అన్యమనస్కంగా సాయంత్రంవరకూ తనపనేదో చేసుకున్నాడు గానీ ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామా అని ఎదురుచూసాడు. ఆఫీసు అవుతూనే అందరికంటే ముందు ఇంటికి బయలుదేరాడు.

ఆమె తన మనసుని మలచుకున్నట్టే మనస్ఫూర్తిగా భర్తకు అనుకూలంగా తన తనువునీ మలచుకుంటూంటే... భార్య అందించిన వరంతో ఆమె అణువణువూ నిండిపోయాడతను. అంతవరకూ తమ మధ్య వున్న వెలితి తీరుతుండగా భర్త స్పర్శలోని ప్రేమని పూర్తిగా ఆస్వాదించిందామె.

:::

"ఏమిటి మిస్టర్ సిద్ధార్థ... ఈరోజు మీలో చాలా మార్పు కనిపిస్తోంది! చాలా హుషారుగా ఉన్నారు?" ఆఫీసులో అడుగుపెట్టగానే సిద్ధార్థని అడిగాడు అతని కొలీగ్ నందన్.

"నెల రోజుల తర్వాత ఇంత ఉల్లాసంగా చూస్తున్నాను మిమ్మల్ని" అన్నాడు.

"ఈయనకు అబ్జర్వేషన్ ఎక్కువే. కరెక్ట్‌గా రోజులు కూడా గుర్తుపెట్టుకుంటున్నాడు" మనసులో అనుకున్నాడు సిద్ధార్థ. నందన్ వైపు చూసి చిరునవ్వుతో తలూపాడు.

"కీపిట్ అప్" అన్నాడు నందన్ తనకేదో అర్థమైనట్టు.

"ఈయన సామాన్యుడు కాదు అన్నీ గమనిస్తూనే వుంటాడు" అనుకుంటూ వెళ్ళి తన చాంబర్‌లో కూర్చున్నాడు సిద్ధార్థ. తరువాత నిమిషంలో తన పనిలో ఇన్‌వాల్వ్ ఐపోయాడు.

సరిగ్గా గంట తర్వాత వచ్చాడు నందన్, సిద్ధార్థ చాంబర్‌లోకి... "సారీ ఫర్ ద డిస్టర్బన్స్"అంటూ. ఆఫీస్ టైమ్‌ని కిల్ చేయటం సిద్ధార్థకి నచ్చదన్నసంగతి నందన్‌కి తెలుసు. నందన్ కూడా సేమ్ ప్రిన్సిపుల్‌తో ఉంటాడు. ఎంతో పని ఉంటేగాని అలారాడు.

"నొ... నొ... ప్లీజ్ బి సీటెడ్" ఛైర్ చూపిస్తూ చెప్పాడు సిద్ధార్థ.

"మీతో చిన్న అవసరమైంది" సిద్ధార్థ ఎదురుగా ఉన్న ఛైర్‌లో కూర్చుంటూ అన్నాడు నందన్. ఎవరు అవసరంలో ఉన్నా నందనే ఆదుకుంటాడు. అలాంటిది అతనికి అవసరమా! నమ్మశక్యం కానట్టు ఆశ్చర్యంగా చూసాడు సిద్ధార్థ.

సిద్ధార్థ ఆలోచన అర్థమైనట్టుగా నవ్వి "నాక్కాదు" అన్నాడు నందన్.

"అయినా నాకే అనుకోండి" అన్నాడు మళ్ళీ. "నా చాంబర్ వైపు చూడండి సిద్ధార్థ అక్కడ ఒకామె కూర్చున్నారు గుర్తుపట్టారో?' అని అడిగాడు నందన్.

ఆమెను వెంటనే గుర్తుపట్టి "ప్రభుగారి మిసెస్ కదా!" అన్నాడు సిద్ధార్థ. "నేను గుర్తుపట్టలేకపోవటమేమిటీ!" అన్నాడు. "పాపం! ఏమిటి ఆమె అవసరం? ఎలా ఉందిప్పుడు వాళ్ళ పరిస్థితి?" అనడిగాడు.

బాధగా పెదవి విరిచాడు నందన్ "ప్రభుగారు చనిపోయి రెండేళ్ళు అవుతుంది కదా! అప్పట్లో మన కంపెనీ యిచ్చిన డబ్బంతా వాళ్ళచుట్టాలు చేరి నాశనం చేసారట. భర్తపోయిన దుఃఖంలో ఈమె అప్పుడు జాగ్రత్త పడలేకపోయారు. డబ్బంతా అయిపోవటంతో తరువాత చుట్టాలంతా మెల్లగా దూరమైపోయారు. ఇద్దరు పిల్లలతో దిక్కులేనిదైపోయింది. ఈమె పెద్దగా చదువుకోలేదు. రోజు కూలీగా అక్కడక్కడ పనులు చేస్తూ యిద్దరు పిల్లల్ని పెంచుతోంది. పిల్లల్ని చదివించటానికి పడరాని పాట్లన్నీ పడుతోంది. అవమానాలు భరిస్తోంది" అని ఆగాడు నందన్.

"ఇదంతా నాకెవరో చెబితే మొన్నామధ్య పలుకరిద్దామని వెళ్ళాను. ఆమె ఎంతో అభిమానవతి. విషయాలు, పరిస్థితులు దాచి నాకేదో మర్యాదలు చేయటానికి ప్రయత్నించింది. ఏదో తాత్కాలికంగా సాయంచేసి వచ్చేయాలనిపించలేదు సిద్ధార్థ. నేనెంతో నచ్చచెబితే ఈరోజు ఇలా వచ్చారామె. మనమేదైనా చేద్దాం. మన స్టాఫ్ నుంచి ఎమౌంట్ కలెక్ట్ చేసి ఆమెతో ఏదైనా షాప్ పెట్టిద్దాం" నందన్ చెబుతుంటే సిద్ధార్థ మనసు సానుభూతితో నిండిపోయింది. మళ్ళీ ఆమెవైపు దృష్టి సారించాడు. ఆమె కూర్చున్న భంగిమలోనే ఏదో దీనత్వం కనిపించింది. తట్టుకోలేకపోయాడు.

"నందన్ ముందు ఆమెను ఇంటికి పంపించేయండి. ఆమె మన స్టాఫ్ ముందు అలా దీనంగా ఉండటం బాగోలేదు." అన్నాడు సిద్ధార్థ బాధగా. "ఆమెతో మనం కచ్చితంగా ఏదైనా షాప్ పెట్టిద్దాం. అందుకు నా సపోర్ట్ హండ్రెడ్ పర్సంట్ ఉంటుంది" అన్నాడు సిద్ధార్థ నిశ్చయంగా.

సిద్ధార్థవైపు అభినందిస్తున్నట్టు చూసి థాంక్స్‌చెప్పి "సరే. మన మిగతా స్టాఫ్‌క్కూడా చెబుతాను"అని నందన్ వెళ్ళిపోయాడు. అతని కాన్ఫిడెన్స్, సమర్థత సిద్ధార్థకు బాగా తెలుసు. ఎంత కరుడుగట్టిన స్వార్థపరుడైనా మానవతావాదిగా మార్చేస్తాడు. కనీసం ఆ సమయానికైనా మోటివేట్ చేస్తాడు.

సిద్ధార్థకు అలకనంద గుర్తుకొచ్చింది. మనసంతా దిగులుతో నిండిపోయింది. అన్యమనస్కంగా సాయంత్రంవరకూ తనపనేదో చేసుకున్నాడు గానీ ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామా అని ఎదురుచూసాడు. ఆఫీసు అవుతూనే అందరికంటే ముందు ఇంటికి బయలుదేరాడు. అతని మనసంతా అపరాధభావంతో నలిగిపోతోంది.

:::::

బీరువా తెరిచింది అలకనంద. లోపల్నుంచి తన సర్టిఫికెట్స్ వున్న ఫైల్ తీసి, వచ్చి హాల్లో కూర్చుంది. తను ఎంతో కష్టపడి, ఎన్నో అవమానాలు పడి, కొన్నిసార్లు పస్తులుండి చదివిన చదువుకి వచ్చిన సర్టిఫికెట్స్ అవి.

(మిగతా 27వ పేజీలో)

(19వ పేజీ తరువాయి)

స్కూలునుంచి యూనివర్సిటీవరకూ, మధ్యలో చేసిన కంప్యూటర్ సర్టిఫికెట్స్- ఇప్పుడివన్నీ ఇక ఎందుకూ పనికిరానివై పోయాయి.

ఒక్కొక్క సర్టిఫికెట్‌ని తల్లి బిడ్డను తాకినట్టు తాకింది ప్రేమగా. ఒక బిడ్డను ప్రసవించటానికి మాతృమూర్తి ఎన్ని అవస్థలు పడుతుందో... ఎంత కష్టం ఓర్చుకుంటుందో తనకు ఇంకా అనుభవంకాలేదు కానీ ఏ పరిస్థితులూ అనుకూలంగా లేక తను ఈ ఒక్కొక్క సర్టిఫికెట్స్ పొందటానికి ఎన్ని అవస్థలు పడిందో... ఎన్ని ఆటంకాలు ఎదుర్కొందో...

సర్టిఫికెట్స్ గుండెలకు హత్తుకుంది. ఇక ఈ చదువుకి ఏ రకంగానూ సార్థకత లేదు. అనుకున్న ప్రయోజనమూ ఇక లేదు. ఆమె కళ్ళవెంట జలజల కన్నీళ్ళు రాలాయి.

ఆమెకు తన పెళ్ళిచూపుల్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. అన్నీ నచ్చాక తనతో విడిగా మాట్లాడాలన్నాడు సిద్ధార్థ. ఇద్దరికీ ఏకాంతం కల్పించారు పెద్దవాళ్ళు.

'మీరు నాకు చాలా నచ్చారు' అన్నాడు సిద్ధార్థ తననే దీక్షగా చూస్తూ.

'అది అందరిముందూ మీరు దాచుకోలేదుగా' అంది తను సంతోషంగా.

"మళ్ళీ చెప్పాలనిపించింది. మళ్ళీ మళ్ళీ చెప్పాలని కూడా అనిపిస్తోంది" అన్నాడు. తనకు సంతోషంతో బాగా నవ్వొచ్చింది.

"మీ నవ్వులతో ఇక ప్రతిరోజూ పులకించిపోయే అదృష్టవంతుడ్ని నేనే అని గర్వంగా ఉంది' అన్నాడు. తను పరవశంతో నవ్వింది.

'మీరు అనవసరంగా అంత చదువు చదివారు' అన్నాడు సడన్‌గా.

తన నవ్వు మాయమైంది. "అదేమిటీ!?" అంది తను విస్మయంగా.

'నాకెలా చెప్పాలో అర్థంకాలేదు. ఏదో ఇంటరో, డిగ్రీయో పూర్తిచేసిన అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకున్నాను. అపార్థం చేసుకోవద్దు. నేనేదో డామినేట్ చెయ్యాలనో... బాగా చదివిన అమ్మాయి... జాబ్ చేసే అమ్మాయి నన్ను డామినేట్ చేస్తుందనో కాదు. ఇంటిపట్టున వుండి నన్నూ పిల్లల్ని ప్రేమగా శ్రద్ధగాచూసుకునే అమ్మాయి భార్యగా కావాలనుకున్నాను. మీరు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారని ఇందాక మీవాళ్ళు మాటల మధ్యలో చెప్పారు. ఆ విషయమే మీతో మాట్లాడాలి. మీరు చదివింది ఎందుకూ పనికిరాకుండా పోయిందని తర్వాత బాధపడకూడదు. మళ్ళీ చెబుతున్నానూ మీరు నాకు బాగా నచ్చారు. మిమ్మల్ని నేను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోలేను. మీకు భయమేమీ వద్దు. నేను బాగానే సంపాదిస్తున్నాను, మనకి పుట్టబోయే పది మంది పిల్లలకైనా' అని నవ్వాడు. తర్వాత మళ్ళీ 'దయ చేసి మీరు ఉద్యోగం అదీ అనొద్దూ' అన్నాడు బ్రతిమలాడినట్టు.

తనకేం మాట్లాడాలో అర్థంకాలేదు. అసలు ఆయనేం చెప్పాడో, తను విన్నదేమిటో పూర్తిగా అర్థంకావటానికే చాలా సమయం పట్టింది. అంతగా- షాక్ తిన్నట్టు మొద్దుబారిపోయింది. తేరుకోలేకపోయింది.

ఈమధ్య అందరూ- బాగా చదువుకున్న అమ్మాయి, ఉద్యోగంచేసే అమ్మాయి భార్యగా రావాలనుకుంటున్నారని తను వింది. చూసింది. ఇదేమిటీయన ఇలా రివర్స్‌లో వచ్చాడు. ఇంక ఈ మనిషికిప్పుడు ఏం చెబితే అర్థమౌతుంది. ఉక్రోషం వచ్చింది. ఎంత ఇష్టపడింది ఆయన్ని. ఇంత దెబ్బతీసాడేమిటీ!

నాన్న ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తూ సడన్‌గా చనిపోయినపుడు అమ్మ ముగ్గురు పిల్లలతో దిక్కులేనిదైపోయింది. ఏవో నాలుగురోజులు చుట్టాలు జాలి చూపినా తరువాతంతా అమ్మే తను ఆడదాన్నని మరచిపోయి ముగ్గురు పిల్లలను పెంచటానికి, చదివించటానికి రాత్రీ పగలూ చాకిరి చేసింది. తమ జీవితంలో పడిన అవమానాలు చెప్పటానికి మాటలు చాలవు.

ఒక కుటుంబంలో పోషించే పెద్ద సడన్‌గా చనిపోతే ఏ ఆధారం లేక ఆ కుటుంబం ఎంత అల్లకల్లోలమైపోతుందో... ఈ లోకానికి ఆ కుటుంబమెంత పాపిష్టిదైపోతుందో- తను, తన కుటుంబం అనుభవించింది.

తమ్ముడు చెల్లి తనూ చదవే ధ్యేయంగా అమ్మ ఆశని నెరవేర్చటానికి ఆ వయసులో ఉండే చిన్ని చిన్ని సరదాలని సంతోషాల్ని వదిలేసుకున్నారు. తాము వదిలేయటం కాదు అవే తమకు దూరంగా వెళ్ళిపోయాయి.

ఆడపిల్లలకీ చదువెంత ముఖ్యమో ఉద్యోగం ఎంత అవసరమో ప్రతిసారీ జ్ఞాపకం చేసేది అమ్మ. చవరికి ఈయన ఉద్యోగమా! పెళ్ళా! అని తేల్చుకోమన్నట్టుగా పెద్ద పరీక్ష పెట్టాడు. రెండింటిలో ఏదో ఒకటే అన్నట్టు ఆప్షన్ లేకుండా దెబ్బతీసాడు.

ఆడపిల్లలకీ చదువెంత ముఖ్యమో ఉద్యోగం ఎంత అవసరమో ప్రతిసారీ జ్ఞాపకం చేసేది అమ్మ. చవరికి ఈయన ఉద్యోగమా! పెళ్ళా! అని తేల్చుకోమన్నట్టుగా పెద్ద పరీక్ష పెట్టాడు. రెండింటిలో ఏదో ఒకటే అన్నట్టు ఆప్షన్ లేకుండా దెబ్బతీసాడు.

తనింకా ఆ షాక్‌లో ఉండగనే తన ప్రమేయంలేకుండా అన్నీ మాట్లాడేసుకుని, అన్నీ నిశ్చయించేసుకుని వెళ్ళిపోయాడాయన- తన వాళ్ళతో.

అమ్మా వాళ్ళంతా ఎంతో సంతోషపడిపోయారు. అంత మంచి సంబంధం వచ్చినందుకు. అది కుదిరినందుకు నేనెంతో అదృష్టవంతురాల్నని పొంగిపోయారు.

తను అమ్మ దగ్గర ఆయన చెప్పిన విషయం చెప్పి ఏడ్చినప్పుడు- అమ్మ అంది.

"పిచ్చితల్లీ...అలా ఆలోచించటం తప్పు. అందరికీ నాలా జరగదమ్మా. నువ్వు అదృష్టవంతురాలివే. అయినా... ఇంత చదువుకున్నావ్ పెళ్ళయ్యాక నీ భర్తని మార్చుకోలేవా!" అని ధైర్యం చెప్పింది.

కాని ఏం జరిగింది చివరికి. తనే రాజీపడింది. చిన్నప్పటినుంచి తనలో ముద్రపడిపోయిన భయాన్ని అభద్రతని జయించటానికి సంఘర్షిస్తోంది. ఇంటిని నరకం చేసుకోవటం ఇష్టంలేక తను రాజీపడటం మంచికే అని సమాధానపడింది.

రాత్రినుంచి భర్త సంతోషం, హుషారు, తనమీద చూపిస్తున్న అంత ప్రేమ చూసి అన్ని భయాల్ని దాచేసుకుంది. ఏ అపశ్రుతులు లేకుండా ఇంత హాయిగా జీవితం సాగిపోయేలా చేయమని కాలాన్ని వేడుకుంది.

ఫైల్ తీసుకెళ్ళి బీరువాలో ఎక్కడో అడుగున పడేస్తుంటే- భర్త బైక్ సౌండ్ వినిపించి ఒక్క ఉదుటున బయటకొచ్చేసింది అలకనంద.

తనకోసమలా పరుగున వచ్చిన భార్యను చూసాక అలవికాని అనురాగం సిద్ధార్థని కుదిపేసింది. ఒక్కసారిగా ఆమెను చుట్టుకుపోయాడు.

"నన్ను క్షమించరా కన్నా" అన్నాడు. "నీవి అనవసర భయాలని... ధారుణమైన ఆలోచనని... అంతకంటే అన్యాయంగా నీది మహాస్వార్థమని అపోహపడ్డాను. నిన్ను అవమానించాను. నన్ను క్షమించు"అని ప్రాధేయపడ్డాడు.

భర్తని, అవాక్కైనట్టుగా... సంభ్రమంగా చూస్తుండిపోయింది.

భర్త అంతలోనే అలా ఎలామారిపోయాడో తనని సరిగ్గా ఎలా అర్థం చేసుకోగలిగాడో ఆమె అడగలేదు. అతను చెప్పలేదు. అదంతా ఇక అనవసరం. తన వారి కోసం ఎలాగైతే ఏమిటి- కన్విన్స్ అవటం ముఖ్యం.

భార్యను ఎంతో సంతోషపెట్టాలని సిద్ధార్థకి. భర్తకి అంతకంటే ఎంతో సంతోషమైంది అలకనంద.

★

రచయిత చిరునామా:
రాపాక సన్ని విజయక్రిష్ణ,
ఎమ్.ఐ.జి-2/305, రాజీవ్‌నగర్,
వడ్లపూడి పోస్ట్, విశాఖపట్నం- 42.

